# 'ఈ ప్రశ్న పరీక్షలో రాదు....'

* ఎస్. ఏ. ఖాదర్ *

సైలెన్సు. ఇష్. ఒరే రామూ నీ క్కాదుట్రా చెప్పేది మాష్టరు వస్తున్నాడని. ఒరేః మాణిక్యం ఈటరోయి నీ కెందుకురా? బోర్డుమీద పేరు వ్రాసిపెట్టు.

షటప్, నీవేమి నాకు సలహా చెప్పక్కర లేదు. నోరు మూసుకు కూర్చో.

(క్లాసంతా అల్లరిచేస్తూవుంటుంది. ప్రక్క క్లాసు మాష్టరువచ్చి రామును బెంచి ఎక్కిస్తాడు. ఇంతలో తెలుగుమాష్టరు వస్తాడు.)

ఒరే రామూ వచ్చేంతలోపల ఎందుకురా ఇంతగోల, నాకు వీథిచివరికి వినిపిస్తోంది. సరే, ఎందుకు బెంచెక్కావు?

లేదండి, అందరు గోలచేస్తె నేను చేసానండి. ఆ మాష్టరు నామీద కోపంచేత నన్నే ఎక్కించా డండి.

ఏడిచావులే దిగి కూర్చో, ఆ పుస్తకం తీసి చదువు.

"కుశలవులరణ్యంబేగిన పిమ్మట సీతాదేవి తన పుత్రులకొఱకు కన్నీరు కాల్వలగున ఏడ్చు చుండెను."

ఆ, ఆగు, ఒరే గోపి, నువ్వెంచేత పుస్తకం చూట్టంలేదు? ప్రక్కవాడితో ఎందుకు మాట్లాడు తున్నావు? ఏదైనా సందేహముంటె నన్నడుగు చెప్తాను మాట్లాడకు.

అదికాదండి, కన్నీరు అనేచోట వ్యాకరణ విశేషమేమిటి అని ఆలోచిస్తున్నామండి మాకేం తెలియలేదండీ.

(మేష్టరు తెల్లమొగమేశాడు. తనకు కన్నీరు అనేచోట ఏ వ్యాకరణ విశేషముందో తెలియలేదు. ఇక అవమానాన్ని కప్పిపుచ్చటానికి)

ఒరే రాముః ఆ వెధవకు ఆ వెధవ ప్రశ్న తోచింది. నువ్వుచెప్పు?

అయ్యా! అ ఇ ఎ లు త్రికంబు లనబడు. త్రికముమీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబగు.

అదండి సూత్రం.

ఆ. రైట్. గోపి, వాడు చెప్పేది వ్రాసుకో.

ఇంకొకడు....అది కాదండి. ఆ సూత్రం కాదండి. ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఇకారమునకు సంధి వైకల్పికమండీ. అక్కడ కంటి—నీరు ఉందండి 'టి' అన్న చోట ఇకారమండీ. అదేనండీ సూత్రం.

గోపి....ఓరేయి....నోరుమూయి, నాదెరైటు.

(మేష్టరు తెల్లబోయాడు. రాముడు సమర్థించినదే సరి అని అనుకున్నాడు.)

మే....ఒరే గోపీ! నీ సూత్రం తప్పురా రాముడు చెప్పింది రైటు. అదే రాసుకొండి.

(క్లాసు అంతా గగ్గోల)

పిల్లలు....ఏమిటండి మేష్టారు మేము గోపి చెప్పింది రాసుకొన్నాము. మళ్ళి అది కొట్టివేయాలా? మాకేమి తెలియటం లేదండి. ఏది రైటో చెప్పండి.

మే....ఒరే మీకుకాదు చెప్పటం, ఆ ప్రథమేతర విభక్తి సూత్రము రాసుకొండి.

ఒకడు....అది కాదండి. అది తప్పండి గోపిదే రైటు. ఏలాగంటే. అ ఇ ఎ లు త్రికాలండి కంటిలో ఇకారముందండి దీనిమీద అసంయుక్త హల్లువి వుందండి కాబట్టి కన్నీరు అవుతుందండి.

* ఆనందవాణి

# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు_1

★

[ప్రచురణ : ప్రతి ఆదివారం]

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

★ అర సంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు.

★ 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం.

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే టప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డరు "మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుచెట్టివీధి, జి.టి. మద్రాసు" అని వ్రాయవలెను. వ్యక్తులపేర పంపవద్దు.

—మేనేజరు.


ఇంకొకడు .... నోరు మూసుకోరా. మహ తెలుసు మాకంటె మా సూత్రమె రైటు.

మే .... ఓరే! అరవకండిరా! ప్రక్కన క్లాసుంది తెలుసా.

గోపిపక్ష....వాళ్ళకి బుద్ధిలేదండి వాళ్ళది తప్పండి.

(ఏంచేయడానికి తోచక)

మే....అది కాదురా! ఇందులో మహ ప్రమాదం లేదు. పరీక్షకు రాదుకూడాను. దీనికి పైరెండు సూత్రాలు వర్తిస్తాయి. ఏదైన రైటె కూర్చోండి.

రాముడుపక్షం.... మేష్టారు! మా సూత్రం బాగుంటుందండి. మేము రాసుకుంటామండి. ఏదైన ఒకటె గదండి.

మే....అబ్బ.... ఒకటే గోల! సరే! ఏదైన రాసుకోండి.

గోపిపక్ష:—అది బాగాలేదండి, మాది చిన్న దిగ చక్కగ ఉందండి.

మే:—నే ఇదివరకే చెప్పేనుగా; ఏదైన రాసుకోండి.

(అందరు లేచి అరుస్తూ, మేష్టారు! ఓట్లు తీసుకుందామండీ).

మే:—ఓట్లువద్దు గీట్లువద్దు. మీరసలు వ్రాసుకోనేవద్దు. జాగ్రత్త నోరుమూసుకోండి. ప్రక్క క్లాసులో ఇట్లాగే అల్లరిచేస్తే దంచేసాను విన్న. ఇవ్వాళ బడికి రాలేదు. మీకుగూడా ఆ గతి పడుతుంది. తర్వాత అనుకొని లాభంలేదు.

అందరు:—అది పరీక్షలో వస్తె ఏంచేయడమండీ.

మే :—అబ్బ! ఎన్నిసార్లు చెప్పేది అది పరీక్షకు రాదని. ఎవ్వరు ఇవ్వరుకూడా. ఆ కన్నీరు అనే పదాన్నిగూర్చి పెద్ద పెద్ద కవీశ్వరులకే వివాదాలున్నాయి మీకుమల్లెనె. అవి ఇంకా తేలలేదు. అందుకోసం ఆలోచిస్తున్నా.

(ఇంతలో ఖంగ్-ఖంగ్ మని గంట కొడతారు.)

చాల్లే, ఆగు. ఒక గంటసేపిట్లో ఒక్కలైను జరిగింది. మీకు తెలియదు. చెబితే వినరు.

(అని బ్రతికి బయటపడ్డామురా అనుకొని క్లాసు దాటుతాడు.)

—మునిమాణిక్యంవారి "యదార్థదృశ్యాలు" చదివిన పిదప.